# వి.ఐ.పి. విజిట్

ఎవరైనా వి.ఐ.పి. జిల్లా పర్యటనకు వస్తున్నారంటే చాలు, మా కలెక్టరుగారు హడావుడి చేసేస్తారు.

నా సర్వీసులో ఎంతో మంది ఐ.ఎ.ఎస్. అధికార్లను చూశాను. తెలివితేటల్లోనూ ఉద్యోగరీత్యా కూడా ఐ.ఎ.ఎస్. అధికార్లు పైమెట్లు మీద ఉండటంతో నా దృష్టి ఎక్కువగా వాళ్లమీదే వుండేది. మాటల్లో, చేతల్లో అందరికీ భిన్నంగా వుండాలని అధికారులు తాపత్రయపడుతూ వుంటారని అనుకుంటూ వుండేవాణ్ణి.

మా కొత్త కలెక్టరు గారు గమ్మత్తయిన మనిషి. ఓ రోజు సఫారీ సూట్‌లో వస్తే మరో రోజు గుండీలు ఊడిపోయిన షర్ట్ వేసుకుని ఆఫీసుకు వస్తారు. కార్లో ఓ రోజు, కాలినడకన మరో రోజు; రోడ్డు మీద ఎడ్లబండి కనబడితే ఆ బండి ఎక్కి బండి తోలే రైతుకి డంకన్ ప్రతిపాదనల గరిరించి పూస గుచ్చినట్లు చెప్పిన రోజూ ఉంది.

వేరుశేనక్కాయలు అమ్ముకునేవాడిని పలకరించి 'నీకు రేషన్ బియ్యం సక్రమంగా అందుతున్నాయా' అని అడుగుతూ ఉంటాడని కలెక్టర్‌గారి కారు డ్రైవరు చెబుతూ అందరిని వినోదపరుస్తూ ఉంటాడు. ఆయన ప్రవర్తన విచిత్రంగా అన్పించినా సిన్సియర్ ఆఫీసరని పేరుతెచ్చుకున్నాడు. గడ్డితినే రకంకాదు. నిజాయితీపరుడనే అంటారందరూ.

ఆఫీసులో మొదటిసారి నన్ను చూడగానే "బార్బర్స్ స్ట్రయిక్‌లో ఉన్నారా? హెయిర్ కటింగ్ సెలూన్స్ వొక్కటి కూడా ఓపెన్ చేసి లేదా?" అని అడిగాడాయన.

ఆయన అడిగిన ప్రశ్నకు తికమకపడిపోయాను. హెయిర్‌కటింగ్ సెలూన్స్ సబ్జట్ నాదికాదేననుకున్నాను.

మళ్లీ ఆయనేం మాట్లాడలేదు. ఫైలు చదవడంలో మునిగిపోయాడు.

కలెక్టరు గారి గదిలోనుంచి బయటకొచ్చేక ఆయన ఆ ప్రశ్న ఎందుకు అడిగాడానని

గంటసేపు ఆలోచించాను. టాయిలెట్‌కు వెళ్లినప్పుడు అద్దంలో నా మొహం చూసుకోగానే అసలు విషయం అర్థం అయ్యింది.

బాగా తలమాసిపోయింది.

రాత్రి ఎనిమిదయినా ఇంటికి వెళ్లకుండా హెయిర్ కటింగ్ సెలూన్‌కు వెళ్లి తలకత్తెర వేయించుకున్నాను. "చీకటిపడ్డాక తలకత్తెర ఏమిటండీ?" పైగా మంగళవారం" మా ఆవిడ సణుక్కుంది అంటకత్తెర వేయించుకున్న నన్ను చూసి.

నా మీద బాగా గురి ఏర్పడిందేమో మాటిమాటికి నన్ను తన ఛాంబరుకు పిలుస్తుండేవారు కలెక్టరుగారు.

మా పక్క సెక్షన్ సూపరెన్టెంటు ఈశ్వరరావునయితే మరీ కంగారు పెట్టేశాడు.

అతను కలెక్టరుగారి దగ్గరకు వెళ్లగానే ఆయన చదువుతున్న పుస్తకాన్ని పక్కన పెట్టి "రిలెవెన్స్ ఆఫ్ కమ్యూనిజం టు ప్రజంట్‌డే వరల్డ్" గురించి చెప్పమన్నాడు.

"సార్ నేను ఇంటర్వ్యూకు రాలేదు సార్... లాండ్ ఎసైన్‌మెంట్ సెక్షన్ సూపరెన్టెంటు" ని అన్నాడు ఈశ్వరరావు.

ఈశ్వరరావు వైపు ఎగాదిగా చూసి "నీ వెయిట్ ఎంత? సర్వీసులో చేరిన నాటికీ ఇప్పటికీ ఎంత పెరిగావ్?" అని అడిగారు కలెక్టర్ గారు.

ఏదో నోటికి వచ్చిన అంకెలుచెప్పి బయటపడి నా దగ్గరకొచ్చి మొత్తుకున్నాడు ఈశ్వరరావు.

"ఏమిటి గురూ? బరువెంత అని అడుగుతాడు... తిక్కలాడా ఏమిటి?" అన్నాడతను.

ఓ అయిదు నిముసాలు గడిచేకా గాని నా బుర్రలో ట్యూబ్‌లైట్ వెలగలేదు. ఈశ్వరరావు లంచాలుమేసి బరువు పెరుగుతున్నాడని కలక్టరుగారి భావన. ఆ మాట చెబితే అతనెక్కడ బాధపడతాడోనని మౌనంగా ఉండిపోయాను.

"సరళీకృత ఆర్థిక విధానాలు దేశ ఆర్థిక ప్రగతికి ప్రత్యేకించి నీ ఆర్థిక ప్రగతికి ఏ విధంగా ఉపయోగపడుతున్నాయి?" అని కూరగాయలు అమ్ముకునే కుర్రాడిని ప్రశ్నించాడట కలెక్టర్ గారు ఓ రోజు.

కూరగాయలు అమ్ముకునే వాడు ఆయన అడిగేదేమిటో అర్థం కాక బుర్ర గోక్కుని "నా దగ్గర కూరగాయలు కొన్నవాళ్లెవ్వరికీ పిచ్చి ఎక్కలేదండీ" అన్నాడట.

ఆ విషయం చెప్పి డ్రైవర్ వొకటేనవ్వడం.

కలెక్టరుగారు నన్నూ ఇబ్బంది పెట్టిన సందర్భాలున్నాయి. "కాశ్మీరు సమస్యకి నువ్వు సూచించే పరిష్కార మార్గాలేమిటి?" అని అడిగాడు నన్ను.

ఏం చెప్పాలో అర్థంకాక మౌనంగా వుండిపోతే "మౌనంగా వుండిపోతే కాశ్మీరు సమస్య పరిష్కారమవుతుందా?" మొహం ఇబ్బందిగా పెడితే "కాశ్మీర్ సమస్య చాలా సీరియస్సా?" అనేశాడు.

కలెక్టర్‌గారు రమ్మంటున్నారని అటెండరు వచ్చి చెప్పాడు.

ఆయన ఛాంబరులోకి వెళ్లగానే ఎదురుగా వున్న కుర్చీ చూపించి కూర్చోమన్నట్లు సైగ చేశాడు.

ఎవరితోనో ఫోనులో మాట్లాడి ఫోన్ పెట్టేసి నావైపు చూశాడు.

"నా సంగతి నీకు తెలుసు కదా! ఒక్క క్షణం ఎవర్నీ తీరిగ్గా కూర్చోనివ్వను... నిశ్చలంగా ఉన్న మెదడులోని ఆలోచనా చక్రాన్ని గిర్రున తిరిగేటట్లు చేస్తాను... ఫర్ ఎగ్జాంపుల్... టైమెంతయ్యింది?" అడిగాడాయన.

అటు, ఇటూ చూసి అడిగింది నన్నేనని నిర్ధారణ చేసుకుని వాచీకేసి చూసి "రెండయ్యింది సార్" అన్నాను.

"ఇప్పుడు నువ్వు ఏంఆలోచిస్తున్నావ్ చెప్పమంటావా? సార్ చేతికి వాచీ ఉంది కదా నన్నెందుకు టైం అడిగాడు? ఆయన వాచీ చెడిపోయిందా? తన వాచీ సరిగ్గా పనిచేస్తుందో లేదో తెలుసుకోవడానికి అడిగాడా? నన్నే ఎందుకు టైం అడిగాడు? ఎదురుగా గోడగడియారంలో టైం కనబడు తుందిగా? ఈ సమయంలో సార్‌కు ఏదన్నా ప్రోగ్రామ్ వుందేమో?... చూశారా రామకృష్ణగారూ మీ మెదడులోని చక్రం ఎంత గిర్రున తిరుగుతుందో! 'టైం ఎంత?' అని నేను అడిగిన చిన్న ప్రశ్నకు మీ మెదడంతా కదిలి చురుగ్గా తయారైంది... నిజమేనంటారా?"

బుర్ర తిరిగనంత పనయ్యింది కలెక్టరు గారి మాటలకు.

"యస్ సర్" అన్నాను వెంటనే. "టైం వేస్ట్ చెయ్యడం నా ప్రిన్సిపల్స్‌కి విరుద్ధం... అసలు విషయానికి వొద్దాం... ఇప్పుడే సెక్రటరీ టు సి.ఎం. గారి దగ్గర నుండి ఫోను వొచ్చింది. ముఖ్యమంత్రిగారు మన జిల్లాలో ఆకస్మిక పర్యటన చేయబోతున్నారట" అన్నాడాయన.

...టైంబాంబు పేలినట్లు అన్పించింది. సి.ఎం. గారి పర్యటన అంటే మాటలా?

ఎన్ని పనులు చూడాలి! ముఖ్యమంత్రి గారొచ్చి తిరిగి వెళ్లేంతవరకూ నిద్రాహారాలు ఉండవు ఉద్యోగులందరికీ.

"ఏయే గ్రామాలు పర్యటిస్తారు సార్?" మెదడులోని చక్రం స్పీడుగా తిరుగుతున్నదని కలెక్టరు గారికి తెలియాలని అడిగాను.

"ఆకస్మిక పర్యటన కదా... ముఖ్యమంత్రి గారు ఏయే గ్రామాలు తిరుగుతారో ఆ వివరాలన్నీ కాన్ఫిడెన్షియల్... అయినా నీకు చెబుతున్నాను... మన జిల్లాలో ఒక్క గ్రామమే చూస్తారట... పచ్చల తాడిపర్రు గ్రామం చూస్తారట."

కలెక్టరుగారు ఊరిపేరు చెబుతుంటే ఆ వూరు ఏ మండలంలో ఉందో, జిల్లాలో ఏమూల ఉందో గురుకు వచ్చి చావలేదు. తల గోక్కున్నాను.

" అదేనయ్యా... పొన్నూరు టౌన్‌కు రెండు కిలోమీటర్ల దూరంలో వుంది పచ్చల తాడిపర్రు".

"గుంటూరు జిల్లా వాడినయివుండి ఆ గ్రామం ఎక్కడుందో తెలుసుకోలేకపోయాను. మీరుఈ నెలరోజుల క్రితం ఇక్కడకొచ్చి కలెక్టరుగా పదవీ బాధ్యతలు స్వీకరించి మొత్తం జిల్లా స్వరూపమంతా ఆపోశన పట్టారు. మీది కంప్యూటర్ బ్రెయిన్ సార్" అన్నాను మెచ్చుకోలుగా.

నా మాటలు విననట్లు తలవూపుతూ "ప్లీజ్ కాల్ ది కన్‌సర్న్‌డ్ ఆఫీసర్స్... ఐ విల్ డిస్‌కస్ విత్ దెమ్ ద మెజర్స్ టు బి టేకెన్ టు ఇంప్రూవ్ ది కండిషన్స్ ఆఫ్ దట్ విలేజ్' అన్నాడాయన.

కలెక్టరుగారి గదిలోనుంచి బటయకొచ్చేశాను.

మరుసటి రోజు ఉదయమే యమ్.ఆర్.ఓ., రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, వెటర్నరీ డాక్టరు, ప్రైమరీ హెల్త్ సెంటర్ డాక్టర్, ఆర్ అండ్ బి ఇంజనీరు, అందరూ వొచ్చేశారు.

తన కింది అధికారులంతా కూర్చుని వుంటే కలెక్టరుగారు గదిలో అటూ ఇటూ తిరుగుతూ పచార్లు చెయ్యడం మొదలుపెట్టారు.

ముఖ్యమంత్రిగారి పర్యటనంటే ఎంత గంభీరమైన విషయమో అందరికీ అర్థమైంది. సీరియస్‌నెస్ ఆఫ్ ది ఇష్యూ ఏమిటో తెలిసిపోయింది.

ఐదు నిముషాలు గడిచేక ఉపన్యాసం మొదలుపెట్టారు కలెక్టరుగారు.

"పల్లెటూళ్లు దేశానికి వెన్నెముక లాంటివి... పల్లెపట్టు శరీరంలో గుండెలాంటిది... గుండె ఆరోగ్యంగా ఉన్నప్పుడే శరీరంలోని ఇతర భాగాలూ సక్రమంగా పనిచేసే విధంగానే పల్లెటూళ్లు పచ్చగా కళకళలాడుతుంటేనే దేశం నిలబడగలుగుతుంది. ఆ విషయం గుర్తించి సి.యం.గారు మారుమూలపల్లెల్లోకి చొచ్చుకుపోయి గ్రామస్తుల సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి కృషిచేస్తున్నారు... మనవంతు కృషి మనం చెయ్యాలి."

"గ్రామాలన్నిటిని బాగుచెయ్యాలంటే మన చేతనవుతుందా సార్... మన దగ్గర ఆర్థిక వనరులు తక్కువగా ఉన్నాయి" అన్నాడు పి.ఎ.టు కలెక్టరు మధ్యలో కల్పించుకుని.

"డబ్బు అవసరంలేని సమస్యలు కొన్నింటిని పరిష్కరించవచ్చు... ఇళ్ల స్థలాలు ఇవ్వొచ్చు... భూమిలేని పేదలకు బంజరు భూములు పంచొద్దు" అన్నారు కలెక్టరుగారు.

నా పక్కన కూర్చున్న రెవిన్యూ ఇన్‌స్పెక్టర్ ఏదో సన్నగా గొణుక్కుంటున్నాడు. అతను అస్పష్టంగా అన్న ఆ మాటలు నాకు అర్థమయ్యాయి.

"అన్నీ అందరికి ఉచితంగా ఇచ్చేస్తే మన నోట్లో మన్నే... ఈ కుర్ర కలెక్టరుకు రెవెన్యూ డిపార్టుమెంటు తడాఖా తెలియకే అలా మాట్లాడుతున్నాడు..." అవీ అతను గొణుక్కుంటున్న మాటలు.

"సి.ఎం.గారు పచ్చుల తాడిపర్రు గ్రామం విజిట్ చేయబోతున్నట్లు నాకు మెసేజ్ వొచ్చింది... ఆ వూరిని టచ్‌వేసే రోడ్లన్నీ బాగుచేయించండి" అన్నారు కలెక్టరుగారు ఆర్.బి. ఇంజనీరుతో.

"ఆ గ్రామానికి వెళ్లే రోడ్లన్నీ మనం బాగుచేయించక సి.ఎం.గారు మరో గ్రామంలో ఆకస్మిక పర్యటన జరిపితే?" మనస్సులోని అనుమానం బయటపెట్టాడు ఇంజనీరు.

"డోంట్ డివియేట్ ఫ్రం మైపాయింట్... ముందు చెప్పింది చెయ్యండి... ఎం.ఆర్.ఒ.గారూ, మీరేం చేయబోతున్నారు?" అడిగారు కలెక్టరుగారు.

"మీరేం చెబితే అది చేస్తాను సార్" నమ్రత ఉట్టిపడేలా లేచి నిలబడుతూ అన్నాడు ఎం.ఆర్.ఒ.

"ఆ ఊళ్లో అన్ని ఇళ్లకు సున్నాలు కొట్టించండి... గుడిసెలు పీకేసి పక్కా ఇళ్లు కట్టించండి" అన్నారు కలెక్టరు గారు.

కలెక్టరుగారు తమాషాకు అంటున్నారో, సీరియస్‌గా అంటున్నారో అర్థంకాక తన్నుకున్నాడు ఎం.ఆర్.ఒ.

"మీరేం చేస్తారో నాకు తెలియదు. ఆ గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలి... ముఖ్యమంత్రిగారు వొచ్చేలోపు నేనూ ఓసారి ఆ గ్రామానికి వొచ్చి చూసివెళ్తాను... ఆ గ్రామానికి సంబందించిన అభివృద్ధి కార్యక్రమాలు సమీక్షించుకుందాం... డాక్టరుగారూ మీరు ఆ గ్రామానికి వెళ్లి అందరినీ మెడికల్ చెకప్ చేయండి"

"మందుల స్టాకు లేదు సార్" అన్నాడు డాక్టరు.జ

"ముందు మీరు కదలండి.. ఆ ఊరికి వెళ్లండి.. అందరినీ పరీక్షచేసి మీ దగ్గర ఉన్న మందులు ఇవ్వండి. వాళ్లు తీసుకోవాల్సిన జాగ్రత్తలుచెప్పండి... పెద్ద జబ్బులైతే గుంటూరు జనరల్ హాస్పిటల్‌కు వెళ్లమని చెప్పండి" చెప్పడం ఆపి అటెండరు చేత మూడుగ్లాసులు మంచినీళ్లు తెప్పించుకుని తాగేడు కలెక్టరుగారు.

"ఓ డాక్టరు చేసిన పొరపాటు మూలంగానే నేను ఎక్కువగా మంచినీళ్లు తాగుతున్నది" అన్నారు కలెక్టరుగారు.

"డాక్టరు పొరపాటు ఏమిటి సార్?" అదేమిటో తెలుసుకోవాలనే కుతూహలంతో అడిగేడు డాక్టర్.

"చిన్నప్పుడు కడుపుకోసి ఆపరేషన్ చేశారు...ఆపరేషన్ పూర్తయ్యాక డాక్టరు గారు మర్చిపోయి స్పాంజ్ పొట్టలో ఉంచేసికుట్లు కుట్టేసారు. ఇప్పుడు ఎన్ని మంచినీళ్లు తాగినా ఆ స్పాంజ్ పీలుస్తూనే వుంది.

డాక్టర్ తప్పితే అందరూ నవ్వేశారు. పశువుల డాక్టర్‌వైపు తిరిగి "డాక్టరు గారూ... మీ పేషంట్లు అంతా మూగవాళ్లే! వాళ్ల మూగభాష అర్థంచేసుకుని రోగాలు, రొష్టులు లేకుండా చెయ్యండి. మీరు మాత్రం కుటుంబ నియంత్రణ కార్యక్రమం టార్గెట్ పెట్టుకుని పనిచెయ్యకండి' ' అన్నాడు కలెక్టర్ గారు.

పశువుల డాక్టరుతోసహా అందరూ నవ్వేరు.

"ఆ ఊరికి ఎర్రబస్సు వేయిస్తాను సార్ మీటింగుకు వచ్చిన ఆర్.టి.సి. అధికారి అన్నాడు.

“చీరాల, గుంటూరు, రేపల్లెకు వెళ్లే బస్సులన్నీ ఆ ఉళ్లోనుంచే వెళ్తాయి. నువ్వు ప్రత్యేకంగా బస్సు వేయించనవసరంలేదు. గానీ ఆర్డినరీ బస్సులు ఆ ఊళ్లో ఆగేటట్లు చూడు’ ’ అన్నాడు కలెక్టరుగారు.

ఏ మీటింగుకు వచ్చినా కలెక్టరు గారు బాగానే హోమ్‌వర్క్ చేస్తారని అనిపించింది నా మట్టుకు నాకు.

జనవరి పదో తారీఖురావాల్సిన ముఖ్యమంత్రి గారు రాలేదు. ఫిబ్రవరిలో వస్తున్నట్లు చెప్పారు కలెక్టరు గారు. మళ్ళీ మార్చికి వాయిదా పడింది ఆయన గారి పర్యటన. వారం రోజులు గడిచేక వో ఉత్తరం నాకు యిచ్చి చదవమని చెప్పారు కలెక్టరు గారు.

మహారాజశ్రీ

కలెక్టరు గారి దివ్య సముఖమునకు పచల తాడిపత్రు గ్రామస్థుడు నారప్ప వ్రాయునది : ముఖ్యమంత్రిగారి పర్యటన అనగానే మావూరికి ఎప్పుడూరాని డాక్టరు రోజూ వస్తున్నాడు. పాఠశాలలకు అప్పుడప్పుడు చుట్టం చూపుగా వచ్చిపోయే బడిపంతుళ్ళు ఇప్పుడు కుదురుగా కూర్చుని పాఠాలు చెబుతున్నారు. చవక బియ్యం, కిరోసిన్ లేదని స్టాకు అయిపోయిందని కుంటిసాకులు చెప్పకుండా రేషన్ షాపాయన యిస్తున్నాడు. గుంటలుపడిన రోడ్లు బాగు చేయించారు.

ముఖ్యమంత్రిగారి పర్యటన మరికొన్ని నెలలు వాయిదా పడేటట్లు కృషి చేయండి. ఎందుకంటే సి.ఎం.గారు వొక్కసారి మావూరు వొచ్చివెళ్లిపోయేక మళ్ళీ మమ్మల్ని అధికారులు పట్టించుకోరు.

కృతజ్ఞతలతో

బంగారు ముక్కర నారప్ప వ్రాలు.

ఆ ఉత్తరం చదువుకుని నవ్వుకున్నాను.

సి.యం. గారు రాకముందే పచ్చల తాడిపత్రు గ్రామాన్ని విజిట్ చేద్దామని చెప్పారు కలెక్టరు గారు.

అన్ని శాఖల అధికారుల్ని ఆ వుళ్ళో వుండమని వర్తమానం పంపించాం.

కలెక్టరు గారి కారుని అనుసరించింది మా జీప్.

ఊళ్ళోకి వెళ్ళగానే యం.ఆర్.ఓ., రెవిన్యూ ఇన్‌స్పెక్టరు కలెక్టర్ గారికి స్వాగతం పలికారు.

రచ్చబండ దగ్గర గ్రామసభ ఏర్పాటయ్యింది.

"మీ ఊళ్ళో దొంగసారా వ్యాపారం సాగుతోందా?" కలెక్టరుగారు అడిగేడు.

"సజావుగానే సాగుతూ వుందండి... ముఖ్యమంత్రి గారు వస్తున్నారని తెలిసి ఈ మధ్యే సారా అమ్మకాల జోరు తగ్గిందండి" అన్నాడో ముసలాయన.

"సబ్సిడీ బియ్యం, పంచధార, కిరోసిన్ సక్రమంగా అందుతున్నాయా?"

"ఇస్తున్నారండి" తలూపుతూ అన్నారు గ్రామస్థులు.

వో ముసలమ్మ అందరిని నెట్టుకుని కలెక్టరుగారి దగ్గరకెళ్ళి ఆయన పక్కన కూర్చుంది.

కలెక్టరు గారి భుజాలు నిమిరి కుడిచేత్తో ఆయన బుగ్గలు గట్టిగా ఆ ముసలమ్మ నొక్కబోతే యమ్.ఆర్.ఓ. ఆమెను వారించబోయాడు.

యమ్.ఆర్.వోని లెక్క చెయ్యలేదా విడ.

"సొంతవూరిని మర్చిపోకుండా వూరి బాగోగులు చూస్తున్నావ్. మీ అమ్మ కడుపు చల్లగా నూరేళ్ళు బతకరా నాయనా!" అందామె.

"ఈ ఎండలో నువ్వెందుకు వొచ్చావే పెద్దవ్వా! నువ్వు ఇంటికి వెళ్ళు... ఈ రోజు నీ యింట్లోనే నా భోజనం... ఈ పూట గోంగూర పచ్చడి, వంకాయ పులుసు చెయ్యి... రాత్రికి ఉలవచారు పెట్టు"

కలెక్టరు గారు ఆ మాట అనగానే పడుతూ లేస్తూ కోడలి చెయ్యి పట్టుకుని అక్కడ నుంచి వెళ్ళిపోయిందామె.

అసలు విషయం అప్పుడు అర్థమయ్యింది నాకు.

ముఖ్యమంత్రిగారి పర్యటన అనగానే అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని గ్రామాభివృద్ధికి కృషి చేస్తారని కలెక్టరు గారు ఈ నాటకం ఆడించేరు.

ఐ.ఎ.యస్. బుర్ర కదా మరి ! ✻

**(ఈనాడు ఆదివారం - 14-4-1996)**